క్లుప్తంగా

బ్యాండ్ సెట్ అందజేత



బ్యాండ్ సెట్ అందిస్తున్న హైమద్

సోన్: మండలంలోని జాఫ్రపూర్ ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పూర్వవిద్యార్థి, ఎన్ఆర్ఐ హైమద్ రూ.15వేల విలువైన బ్యాండ్‌సెట్‌ను విరాళంగా అందించారు. మంగళవారం హైమద్ పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడు రవికిరణ్‌కుమార్‌కు బ్యాండ్ సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తొడిశెట్టి పరమేశ్వర్, నగేశ్‌కుమార్, సరళ, ముత్తన్న, జలజ, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

విరాళం అందజేత

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో శ్రీసీతారామాంజనేయ స్వామి దేవస్థానం భూమి కొనుగోలు కోసం సాయినగర్ కాలనీకి చెందిన సట్ల లక్ష్మీనర్సయ్య దంపతులు రూ.11,116 విరాళం అందించారు. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు సతీశ్‌రావు దేశ్‌పాండే, అల్లాడి వెంకటేశ్వర్లు, అయిందాల జనార్దన్ తదితరులున్నారు.

మంత్రిని కలిసిన కలెక్టర్



మంత్రికి మొక్క అందజేస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, అధికారులతో ప్రగతిపై శాఖల వారీగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి డి.అనసూయ (సీతక్క)ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన లలిత

లోకేశ్వరం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీగా బాయమోల్ల లలిత మళ్లీ పదవి బాధ్యతలు స్వీకరించారు. వ్యక్తిగత కారణాలతో లలిత గత నెల 23న సెలవుపై వెళ్లడంతో వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. నెల రోజుల అనంతరం లలిత విధుల్లో చేరినట్లు అధికారులు పేర్కొన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, భోజన్న, కపిల్, ప్రశాంత్, దింగబర్ ఉన్నారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్ పద్మశాలి సంఘం పరిధిలోని శాంతినగర్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యక్షుడిగా అంకం రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా చెట్‌పల్లి దత్తాద్రి, కోశాధికారిగా అంకం మహేందర్, ఉపాధ్యక్షులుగా అంకం శంకర్, బొప్పారపు రాజేశ్వర్, బైరి శ్రీనివాస్, ఆడెపు శంకర్, సంయుక్త కార్యదర్శులుగా రాం భీమలింగు, నల్ల రమేశ్, సలహాదారులుగా శ్రీధర్, బి.లక్ష్మణ్, నారాయణ, ఎ.లక్ష్మణ్, శ్రీనివాస్, భీమేశ్వర్, గౌరవాధ్యక్షుడిగా రాజమొగిలి, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా షెట్పల్లి రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు.

నీటి ట్యాంకులను శుభ్రం చేసిన సిబ్బంది



ట్యాంక్ వద్ద సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కుభీర్: మండల కేంద్రంలో మినీ వాటర్ ట్యాంకులు అపరిశుభ్రంగా మారడంతో ఈనెల 23న మంగళవారం సాక్షిలో పాకురెక్కిన నీటి ట్యాంకులు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించి న గ్రామపంచాయతీ సిబ్బంది మినీ వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి పరిసరాల్లో బ్లీచింగ్ చల్లించారు. పనులను పంచాయతీ ఈవో విజయ్ దగ్గరుండి పర్యవేక్షించారు.

పంటలు పరిశీలన

ముధోల్: రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో భాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎడ్‌బిడ్‌లో పంటలు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.

దిగుబడి.. దిగాలు

- పత్తి రైతును నిండా ముంచిన అధిక వర్షాలు, తెగుళ్లు
- భారీగా తగ్గిన దిగుబడులు
- పెట్టుబడులూ వచ్చేలా లేవని అన్నదాతల ఆందోళన
- మద్దతు ధర పెంచాలని వేడుకోలు
- చేన్లు తొలగించి మక్క వేస్తున్న వైనం



లోకేశ్వరంలో తెగుళ్లు సోకి ఎండిన పత్తి పంట



ధర్మోరలో పత్తి చేను తొలగిస్తున్న రైతులు

లోకేశ్వరం: తెల్లబంగారంగా పేరొందిన పత్తి పంట సాగు చేసే రైతులకు విత్తనం విత్తినప్పటి నుంచి దిగుబడి చేతికొచ్చే వరకు కష్టాలు తప్పడం లేదు. ప్రారంభంలో విత్తనాలు సరిగా మొలకెత్తకపోవడం, తర్వాత అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ఓ వైపు దిగుబడి రాక.. మరోవైపు మద్దతు ధర పెరగకపోవడంతో తమను దూదిపూల పంట నట్టేట ముంచిందని కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఎకరాకు ఐదు క్వింటాళ్లే..

జిల్లాలో ఈ సారి వర్షాకాలంలో 65 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా గతేడాది కంటే ఈసారి 60 వేల క్వింటాళ్ల మేర పత్తి పంట దిగుబడులు తగ్గాయి. మొదల్లో ఆరుసార్లు ఏరుదామనుకున్న చేన్లు రెండు సార్లకే లూటీ పోతున్నాయి. దీంతో కొందరు రైతులు తమ చేన్లను చెడగొట్టి యాసంగిలో మక్క సాగు చేస్తున్నారు. ఎకరం చేనులో విత్తనాలు విత్తడం, కలుపుతీతకు కూలీల ఖర్చు, పురుగు మందులు, ఎరువులకు కలిపి సుమారు రూ.40 వేల వేరకు పెట్టుబడులు పెట్టినట్లు రైతులు పేర్కొన్నారు. గతంలో ఎకరంలో 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రాగా.. ఈసారి మాత్రం ఐదు నుంచి ఎనిమిది క్వింటాళ్లే వచ్చింది. కొన్ని చోట్ల మూడు నుంచి ఐదు క్వింటాళ్లు రాగా.. మరికొన్ని చోట్ల మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదని అన్నదాతలు వాపోతున్నారు.

మద్దతు ధర పెంచాలి..

ఈసారి ప్రారంభంలో భైంసా వ్యవసాయ మార్కెట్‌లో పత్తి పంటకు క్వింటాల్‌కు ధర రూ.7 వేల వరకు పలకింది. ప్రైవేటు వ్యాపారులు మాత్రం తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ(పత్తి కొనుగోలు కేంద్రం)లో ఎనిమిది శాతం తేమ ఉన్న పంటకే క్వింటాల్‌కు రూ.7020 మద్దతు ధర అందిస్తున్నారు. తేమ శాతం ఎక్కువ ఉంటే పంటకు ధర తగ్గిస్తారు. ఈసారి అధిక వర్షాలు, తెగుళ్లతో నష్టపోయామని.. ప్రభుత్వం మద్దతు ధర రూ.15 వేల వరకు పెంచి తమకు న్యాయం చేయాలని రైతులు వేడుకుంటున్నారు. ఇప్పటికే కూలీల ఖర్చులకు తక్కువ ధరకు కొంత పంటను అమ్ముకున్నామని.. మరికొంత ఇంట్లో నిల్వ చేసుకున్నామని.. మిగిలినా పంటకైనా మద్దతు ధర పెంచాలని కోరుతున్నారు.

మక్క సాగుకు మొగ్గు..

దిగుబడులపై ఆశ లేక కొందరు రైతులు పత్తి పంట చెడగొట్టి మక్క సాగు వైపు మొగ్గుతున్నారు. ఇప్పటికే ఆరు వేల ఎకరాల్లో మక్క సాగు చేయగా.. మరో ఐదు వేల ఎకరాలు సాగులోకి రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మక్కకు డిమాండ్ ఉంటుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదని రైతులు పేర్కొంటున్నారు.

నివేదికలు పంపించాం

పత్తి పంటను విత్తే ముందు సస్యరక్షణ చర్యలు చేట్టాలి. అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసుకొని ప్రభుత్వానికి నివేదికలు పంపించాం.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

తీవ్రంగా నష్టపోయాం..



ఐదెకరాల్లో పత్తి సాగు చేశా. ఎకరాకు నాలుగు క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. మొదట్లో అమ్మిన పంటకు క్వింటాల్‌కు రూ.6200, రెండోసారి ధర రూ.5900 పలికింది. ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడి అయింది. భారీ వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం పరిహారమిచ్చి ఆదుకోవాలి.

– ప్రవీణ్‌రెడ్డి, ధర్మోర

మొక్కజొన్న సాగు చేశా



గతేడాది మాదిరి ధర ఉంటుందని ఈసారి పత్తి పంట సాగు చేశా. ఐదెకరాలకు 18 క్వింటాళ్ల దిగుబడే వచ్చింది. క్వింటాల్‌కు రూ.ఆరు వేల చొప్పున భైంసా మార్కెట్‌లో అమ్ముకున్నా. లాభం లేదని పత్తి చేను తొలగించి యాసంగిలో మొక్కజొన్న సాగు చేశా.

– చంద్రశేఖర్‌రెడ్డి, రాయపూర్‌కాండ్లీ

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్

భైంసాటౌన్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు కందుల పంటను విక్రయించాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏఎంసీ ఆవరణలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమ పంటను దళారులకు విక్రయించి మోసపోద్దన్నారు. క్వింటాల్ పంటకు రూ.9,140 అందిస్తున్నామని.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి అడెల్లు, ఏడీఏ వీణ, ఏవో రాంచందర్‌నాయక్, ఎంపీపీ అబ్దుల్ రజాక్, రమేశ్, నర్సాగౌడ్, దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.



కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

ఎమ్మెల్యే పరామర్శ

కుంటాల: మండల కేంద్రానికి చెందిన విఠల్‌రావు, సుద్దపు మోహన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాలను మంగళవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించి మృతికి కారణాలు తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీపీ గజ్జారాం యాదవ్, బాసర జెడ్పీటీసీ ఎస్.రమేశ్, వెంగళరావు, రమణారావు తదితరులు ఉన్నారు.

ఆదాయ వనరులు పెంచుకోవాలి

కుంటాల: పంచాయతీల అభివృద్ధికి ఆదాయ వనరులను పెంచుకోవాలని ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఓలా బస్టాండ్ ఆవరణలో ప్రత్యేక నిధులతో నిర్మించిన వ్యాపార సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం పాత గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. సర్పంచ్ కనీస్ ఫాతిమా, ఉపసర్పంచ్ రాంజి, ఎంపీటీసీ కట్ట రవి, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, నాలం శ్రీనివాస్, హైమద్ పాషా, వై.అశోక్‌కుమార్, శరత్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎగ్గం నర్సింలు, మహేందర్, కార్యదర్శి యోగేశ్ తదితరులు పాల్గొన్నారు.



సముదాయం ప్రారంభిస్తున్న ఎంపీపీ గజ్జారాం

చెకుముకి టాలెంట్ పరీక్ష

నిర్మల్‌రూరల్: మండలంలోని చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గజపల్లి నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థులలో తార్కిక, హేతుబద్ధ ఆలోచనలు, పరిశోధనాత్మక భావనలు రేకెత్తించటానికి ఇలాంటి పరీక్షలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో తొలిస్థానంలో నిలిచిన 8,9,10 తరగతుల నుంచి ఒక్కో విద్యార్థి మండల స్థాయికి అర్హత సాధిస్తారని అన్నారు. రెండు మీడియంలు ఉన్న పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున రెండు బృందాలను పంపాలని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, కుమార్, పోతన్న, వహీద్, రాజేశ్వరి, దీవెన పాల్గొన్నారు.



పరీక్ష పత్రం ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సదరం క్యాంపునకు స్పందన

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం దివ్యాంగుల కోసం సదరం క్యాంపు నిర్వహించారు. 60 మంది మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకోగా.. హాజరైన 55 మందికి పరీక్షలు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ వంశీమాధవ్, సదరం క్యాంపు ఇన్‌చార్జి ప్రదీప్ తెలిపారు. డాక్టర్ అరుణ్ (ఆర్థోపెడిక్), డాక్టర్ దామెరవాసు(పీడియాట్రిక్), డాక్టర్ దయాకర్(జనరల్ మెడిసిన్) ఆధ్వర్యంలో పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు. స్లాట్ బుక్ చేసుకోకుండా వచ్చినవారికి పరీక్షలు చేయలేదు.

బహుమతులు అందజేత

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేట గ్రామంలో జై సేవాలాల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయి. మంగళవారం విజేతలకు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ప్రథమ బహుమతి ఖానాపూర్ జట్టు, ద్వితీయ బహుమతి బీర్నంది జట్లకు షీల్డులను అందజేశారు. కార్యక్రమంలో సాగి పెద్ద లక్ష్మణరావు, గోపాల్, వినోద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

భైంసా: బాసరలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సర్పంచ్ లక్ష్మణ్‌రావు ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే గుర్తింపు వస్తుందని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సతీశ్వర్‌రావు, సంజీవ్‌రావు దేశాయి, ఎంఈఓ మైసాజీ, ఎంపీడీఓ నాగ్‌నాథ్, మెడికల్ ఆఫీసర్ ఆకాశ్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, తేజశ్రీ, పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రమేశ్, నర్సారెడ్డి పాల్గొన్నారు

కాంగ్రెస్ నాయకుల ధర్నా

భైంసాటౌన్: పట్టణంలోని బస్టాండ్ వద్ద రహదారిపై కాంగ్రెస్ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. అస్సాంలో రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రపై దాడికి నిరసనగా ధర్నా చేపట్టినట్లు సీనియర్ నాయకులు ఆనంద్‌రావు సింధే అన్నారు. న్యాయ్ యాత్రను బీజేపీ నాయకులు అడ్డుకోవడాన్ని తాము ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో శంకర్ చంద్రే, ఓంప్రకాశ్ లడ్డా, లతీఫ్ తదితరులు ఉన్నారు.

స్పందించి.. ఇసుక తొలగించి

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ నుంచి మూటాపూర్ గుండా నిర్మల్ వెళ్లే మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సరస్వతి కాలువ బ్రిడ్జిపై పెద్ద మొత్తంలో ఇసుక చేరింది. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి తరుచుగా ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారు. మంగళవారం రాచాపూర్‌కు చెందిన బన్నెబోయిన రాము ప్రమాదాలు జరగకుండా తన ట్రాక్టర్‌తో బ్రిడ్జిపై పేరుకుపోయిన ఇసుకను పూర్తిగా తొలగించారు.



బ్రిడ్జిపై ఇసుకను తొలగిస్తున్న రాము

నేతాజీని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



భైంసాలో పూలమాల వేస్తున్న రామారావుపటేల్



కడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



కుభీర్‌లో..

భైంసాటౌన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. పట్టణంలోని నేతాజీనగర్‌లో మంగళవారం సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు మల్లేశ్, గాలి రవి, శ్రీనివాస్, లస్మన్న, నేతాజీ యూత్ సభ్యులు ఉన్నారు.

కుభీర్: మండల కేంద్రంలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సుభాశ్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ దేశం కోసం చేసిన పోరాటాలను విద్యార్థులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు సంపత్, రమేశ్, భాస్కర్, మాధవి, నర్సయ్య, లింగయ్య, గజేందర్, శివరాజ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

కడెంలో కర్తవ్యబోధ్ దివాస్

కడెం: దేశం కోసం పోరాటం, ప్రాణత్యాగం చేసిన మహనీయులే నిజమైన హీరోలని తపస్ రాష్ట్ర బాధ్యుడు శశిరాజ్ అన్నారు. స్వామి వివేకానందుడి జయంతి నుంచి సుభాశ్ చంద్రబోస్ జయంతి వరకు తపస్ ఆధ్వర్యంలో 'కర్తవ్యబోధ్ దివాస్' పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం కడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించి నేతాజీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజన్న, ఎన్ఎస్ఎస్ పీవో స్వామి, నవీన్, సుదర్శన్, దత్తురాం, వినోద్, అధ్యాపకులు తదితరులున్నారు.



నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో న్యాయవాదులు నిర్మల్ బార్ మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి నివాసంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. న్యాయవాదులు అల్లూరి కష్ణవేణి, నూనె గంగాధర్, రమణ, నరేందర్, వి.మహేందర్, బి.దిలీప్, వై.సాయికుమార్, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ఉన్నత చదువులు చెప్పించాలి



తానూరులో అధికారులు, విద్యార్థుల ప్రతిజ్ఞ



లక్ష్మణచాంద కేజీబీవీలో..

కుంటాల: బాలలతో సమానంగా బాలికలకు ఉన్నత చదువులు చెప్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద అన్నారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని కుంటాల ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, భ్రూణ హత్యలు, బాలిక అక్రమ రవాణా గురించి వివరించారు. ఆపదలో 100, 181, 1098 నెంబర్లకు ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్లు రాణి, గుణసుందరి, విమల, రేఖ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు బేటీ బచావో– బేటీ పడావోలో భాగంగా బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, అనిత, మీనా ఉన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. సీడీపీవో శ్రీమతి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలతో జరిగే నష్టాలను వివరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. సూపర్‌వైజర్ శారద, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: బాలికలను చదివిద్దాం–ఎదగనిద్దాం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారం, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఎస్‌వో నవిత, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, రాజామణి, ప్రేమల తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు

తానూరు: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని ఎల్వి, బోరిగాం, తానూరు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఎల్వి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, ఉపాధ్యాయులు భూమన్న యాదవ్, మాధవ్‌రావ్, సుదర్శన్, గంగారాణి, సుజాతదేవి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని పాతఎల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ×ప్యాలాలు బుక్కే పోటీలు×నిర్వహించారు. గెలుపొందిన వారికి ఈనెల 26న బహుమతులను ప్రదానం చేస్తామని హెచ్ఎం మారుతిస్వామి పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు కిషన్ ఉన్నారు.

ఈరోజు

మండల సర్వసభ్య సమావేశం

భైంసారూరల్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం భైంసా మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముధోల్: మండల కేంద్రంతోపాటు బ్రహ్మణ్‌గావ్, బిద్రెల్లి సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ బి.లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ లైన్ల నిర్వహణ, మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

లోకేశ్వరం: మరమ్మతులు చేపడుతున్నందున మండలంలోని అబ్దుల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అబ్దుల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధి గ్రామస్తులు గమనించాలని కోరారు.

నేడు, రేపు భగీరథ నీటి సరఫరా నిలిపివేత

ఖానాపూర్: కడెం–ఖానాపూర్ సెగ్మెంట్‌లలోని 23 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రంలో నిర్వహణ పనుల నిమిత్తం బుధ, గురువారాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు సబ్ డివిజన్ ఉప కార్యనిర్వాహక అధికారి జె.వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్, జన్నారం మండలాల్లో నీటి అంతరాయం ఉంటుందని.. ప్రజలు గమనించాలని కోరారు.

పోటీలు

కుంటాల: మండలంలోని లింబా(కే) జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, చెస్, వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. హెచ్ఎం నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.